సాక్షి మెదక్

శుక్రవారం । 16 । జూన్ । 2023



విత్తన దందా

పత్తి విత్తనవిక్రయాల్లో అక్రమార్కులు కొత్త తరహా దందాకు తెరలేపారు. అన్ని రకాల విత్తనాలు ఒకే రకమైన ఫలితాలు ఇస్తున్నా.. రైతులకు మాత్రం కొన్ని రకాలనే అంటగడుతున్నారు. 8లో



రోడ్డు టెర్రర్

8లో

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరుచోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు గాయపడ్డారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు, ఓ చోట ముందు కారును ఢీకొట్టి, మరోచోట అదుపు తప్పిన లారీ.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని బూర్గుపల్లి, రామోజిపల్లి ఫీడర్‌ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ మోహన్, ఏఈ శంకర్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలో సబ్‌స్టేషన్‌ల మరమ్మతులు, పోల్స్ సరిచేస్తున్నామన్నారు.

న్యూస్‌రీల్

మనఊరు -మనబడి పనుల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

వెల్దుర్తి(తూప్రాన్): మండలపరిధిలోని కుకునూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు-మనబడి పనులను గురువారం డీఈఓ రాధాకిషన్ పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబాట కార్యక్రమం కింద 7వేల అడ్మిషన్లు టార్గెట్ పెట్టుకోగా, ఇప్పటికే 5000 అడ్మిషన్లు పూర్తి చేశామని, అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సరఫరా అయ్యాయని విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సాంబయ్య పాల్గొన్నారు.

కొలతల్లో తేడా కనిపిస్తే అధికారులకు ఫోన్ చేయండి



కుసంగిలో మాట్లాడుతున్న తూనికల కొలతల జిల్లా అధికారి సుధాకర్

టేక్మాల్(మెదక్): తూనికలు, కొలతల్లో ఎక్కడయినా మోసం జరిగినట్టు అనుమానం వస్తే వెంటనే అధికారులను సంప్రదించాలని ఆశాఖ జిల్లాఅధికారి సుధాకర్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని కుసంగి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తూనికలు, కొలతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా కోఆప్షన్‌సభ్యుడు సయ్యద్‌యూసుఫ్, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ వెంకటేశం, విజిలెన్స్ కమిటీ సభ్యుడు మొగులయ్య, హెచ్‌ఎం గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరులో కేంద్రం మొండిచేయి



సుతారిపల్లిలో బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): నిధుల మంజూరు విషయమై కేంద్రం మొండిచేయి చూపిస్తుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం మండలంలోని ఆర్‌వెంకటాపూర్, శివ్వాయపల్లి, సుతారిపల్లి గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేడు గ్రామాల రూపురేఖలు మారాయని, పల్లెలన్నీ పచ్చని చెట్లు, అభివృద్ధితో కళకళలాడుతున్నాయన్నారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని సీఎం విశ్వసిస్తున్నారని, అందుకే వారికోసం ఎంతో చేస్తున్నారన్నారు. సుతారిపల్లిలో బతుకమ్మలు, బోనాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలకగా, ఆమె బోనం ఎత్తుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, ఎంపీపీ బిక్షపతి, సర్పంచ్‌లు మహేందర్‌రెడ్డి, రాగి సంధ్య, శంకర్, మున్సిపల్ కౌన్సిలర్ నాగరాజు పాల్గొన్నారు.

81వ రోజుకు చేరిన దీక్షలు



రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం రామాయంపేటలో చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 81 రోజుకు చేరుకున్నాయి. అఖిలపక్షం ఆధ్వర్యంలో ఈ దీక్షలు కొనసాగుతున్నాయి. డివిజన్ సాధించేవరకు తాము విశ్రమించమని, ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు.

120 మంది గైర్హాజరు

మెదక్ కలెక్టరేట్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో 120మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్ పరీక్షల నోడల్ అధికారి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం జరిగిన ఇంటర్ ప్రథమ పరీక్షలకు 834మందికి 805మంది మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సర పరీక్షలకు 2147మందికి 2056మంది హాజరయ్యారు.

ఫిట్‌లెస్

ప్రైవేట్ బస్సు భద్రమేనా ?

జిల్లాలో స్కూల్ బస్సులు	373
ఫిట్‌నెస్ ఉన్నవి	134
ఇంకా చేయించనవి	134
రిజిస్ట్రేషన్ గడువు ముగిసినవి	105



మెదక్‌జోన్: స్కూల్‌బస్సు అనగానే విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రుల్లో ఓ వణుకు. 2014 జూలై 24న, మాసాయిపేట శివారులోని కాపలాలేని రైల్వే గేటును స్కూల్ బస్సు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో 16 మంది విద్యార్థులతో పాటు, డ్రైవర్, క్లీనర్‌లు దుర్మణం పాలయ్యారు. అప్పట్లో ఈ ఘటన దేశంలోనే సంచలనం సృష్టించింది. నాటి నుంచి జిల్లాలో స్కూల్ బస్సులు గుర్తుకొస్తేనే...? అవి భద్రమేనా అనే ప్రశ్న తలెత్తక మానదు.

- గత విద్యా సంవత్సరం లెక్కల ప్రకారం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల పరిధిలో 373 బస్సులు ఉన్నాయి.వాటిలో 105 బస్సులు 15 ఏళ్ల దాటినవి కావడంతో అవి కాలం చెల్లిన బస్సుల జాబితాలో పరిగణనలోకి తీసుకుంటారు.
- మిగిలిన 268 బస్సుల్లో 134 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ ఉంది. ఇంకా 134 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోకుండానే రోడ్లపై తిరుగుతున్నాయి.

ఏప్రిల్ నుంచే..

- ప్రైవేట్ స్కూల్ బస్సులకు ఏప్రిల్ నెల నుంచే ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు.
- ఆ దిశగా అన్ని రకాల శాఖా కార్యాలయాల్లో ప్రత్యేకంగా కౌంటర్లు తెరిచారు.
- నిర్ణీత చలానా చెల్లించి బడి బస్సులు తీసుకెళ్లి ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. కానీ చాలా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎందుకో ఆసక్తి చూపలేదు.
- కాగా ఫిట్‌నెస్‌కోసం రెండు నెలలపాటు అవకాశం కల్పించినా ప్రైవేట్ యజమాన్యాలు ఆసక్తి చూపటంలేదు.
- ఫిట్‌నెస్ పూర్తి కాని 134 బస్సులతోపాటు కాలం చెల్లిన 105 బస్సులను పక్కన పెట్టారా ?లేక పోతే వాటిల్లో విద్యార్థులను తరలిస్తున్నారా అనే విషయం అధికారులు తనిఖీలు చేస్తేగానీ తెలియదు.
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలనే డిమాండ్ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వినిపిస్తోంది.

చర్యలు తప్పవు

ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థులను పాఠశాలలకు తరలిస్తే వాటిని సీజ్‌చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ఫిట్‌నెస్ చేయించాకనే వాటిలో విద్యార్థులను తరలించాలి. లేనిచో శాఖాపరమైనా చర్యలు తప్పవు

– శ్రీనివాస్‌గౌడ్, మెదక్ డీటీఓ



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ నేతలతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయులు

ఎమ్మెల్యే కనుసన్నల్లోనే అక్రమ రవాణా

ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో కాంగ్రెస్, బీజేపీ నేతల నిరసన

నర్సాపూర్: ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు జిల్లా యంత్రాంగం కనుసన్నల్లోనే అక్రమంగా మట్టి రవాణా కొనసాగుతుందని బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. నర్సాపూర్ మీదుగా చెరువుల నుంచి నల్లమట్టి అక్రమ రవాణాను అదుపు చేయాలన్న డిమాండ్‌తో రెండు పార్టీల నేతలు గురువారం పట్టణంలో పలు వ్యాపార సంస్థలు బంద్ చేయించారు. అనంతరం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలోని ఆర్డీఓ చాంబర్ ఎదుట నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. ఆర్డీఓ శ్రీనివాసులు ఎలక్షన్ డ్యూటీకి వెళ్లడంతో ఆయా పార్టీల నేతలకు నచ్చచెప్పి అక్కడి నుంచి పంపేందుకు తహసీల్దార్ ఆంజనేయులు ఆర్డీఓ ఆఫీసుకు వచ్చారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ నేతలు తమ డిమాండ్లను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సింగాయిపల్లిగోపి, టీపీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్‌లు మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వ భూములు ఆక్రమించడం, చెరువుల నుంచి మట్టిని అక్రమంగా రవాణా చేయడం, ఇసుకను తరలించే అక్రమ పనులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నెలరోజుల్లోనే చెరువుల నుంచి 15నుంచి 20కోట్ల రూపాయల విలువ చేసే నల్లమట్టి ఇతర ప్రాంతాలకు తరలించారన్నారు. నర్సాపూర్‌లో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు ఆక్రమణల పాలవుతున్నాయని చెప్పినా అధికారులు స్పందించడం లేదన్నారు. నిరసనలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేష్‌గౌడ్, రాజేందర్, చిన్న ఆంజనేయులుగౌడ్, రమేష్, బాల్‌రాజ్, ప్రేం, అంజిగౌడ్, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలి

నర్సాపూర్ చౌరస్తా వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి అక్రమంగా మట్టి తరలివెళ్లకుండా చూడాలని తహసీల్దార్ ఆంజనేయులు తమకు లేఖ రాశారని ఎస్‌ఐ శివకుమార్ చెప్పారు. చెరువుల నుంచి నల్లమట్టి తరలించిన ఘటనలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తహసల్దార్ ఆ లేఖలో పేర్కొన్నారన్నారు. త్వరలోనే చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తామన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

రేపు జిల్లాకు హైకోర్టు చీఫ్ జస్టిస్ రాక

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్న కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: మెదక్ పట్టణానికి శనివారం రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్‌భూయన్‌తో పాటు హైకోర్టు జడ్జిలు నవీన్‌రావు, సంతోష్‌రెడ్డి తదితరులు వస్తున్నారని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేష్‌లతో కలిసి అధికారులతో చీఫ్ జస్టిస్ రాకపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలోని కోర్టు సముదాయంలో రూ.5 కోట్లతో వ్యయంతో నిర్మించనున్న 3వ అంతస్తు భవన నిర్మాణానికి రాష్ట్ర హైకోర్టు చీఫ్ శంకుస్థాపన చేస్తారన్నారు. వారి కోసం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్, ఫారెస్ట్ గెస్ట్‌హౌస్ అన్ని హంగులతో సిద్ధం చేయాలని ఆర్‌అండ్ బీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. వారు సీఎస్‌ఐ చర్చి, ఏడుపాయల సందర్శిస్తారని, ఈసందర్భంగా లోటుపాట్లు జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని, జనరేటర్ సిద్ధంగా ఉంచాలని విద్యుత్ అధికారికి సూచించారు. ఏడుపాయలలో పూర్ణకుంభంతో స్వాగతం, దర్శనం, హరిత హోటల్‌లో విశ్రమించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని ఈఓ సాయి శ్రీనివాస్‌కు సూచించారు. సీజే పర్యటించే ప్రాంతాలను శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు సాయి రామ్, శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేష్, డీఎంఅండ్‌హెచ్‌ఓ చందునాయక్, ఉద్యాన అధికారి నర్సయ్య, డీఎఫ్‌ఓ రవి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్, ఏడుపాయల ఈఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల రూపురేఖలు మారాయి

పల్లెప్రగతి దినోత్సవంలో కలెక్టర్ రాజర్షిషా

టేక్మాల్(మెదక్): పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలే మారిపోయాయని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం మండలపరిధిలోని ఎల్లుపేట సర్పంచ్ బోరంచసాయిలు ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి ర్యాలీగా బయలుదేరి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పల్లె ప్రకృతివనాలను సందర్శించారు. పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తూ సర్పంచ్, ప్రజాప్రతినిధులు గ్రామంలో ఏఏ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 469 గ్రామ పంచాయతీలలో పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. కేసీఆర్‌కిట్, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు వంటి ఎన్నో పథకాల ద్వారా గ్రామస్తులు లబ్ధి పొందారన్నారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ పల్లెలు ప్రగతికి చిహ్నాలని, పచ్చదనం, పరిశుభ్రత ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని తలంపుతో సీఎం పల్లెప్రగతి చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జెమ్లా నాయక్, ఎంపీపీ చింతస్వప్న, ఎంపీడీఓ భారతి, ఉపసర్పంచ్ మల్లేశం, ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, ఏపీఓ పోలు, ఏపీఎం గోపాల్, పంచాయతీ కార్యదర్శి సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎల్లుపేటలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షిషా



తుక్కాపూర్‌లో జీపీ భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు

ప్రజాసంక్షేమానికి ప్రాధాన్యం

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఏటిగడ్డ మాందాపూర్‌లో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్నారు. నాయినిజలాల్‌పూర్, వసురం తండా, వెంకటాపూర్, కిష్టాపూర్, సీతారాంతండా, తుక్కాపూర్ వై.మాందాపూర్, రంగంపేట గ్రామాల్లో ఎస్‌డీఎఫ్, ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేశారు. ఇదే నిధుల కింద పోతంశెట్టిపల్లిలో రూ.25లక్షలు, అప్పాజీపల్లిలో రూ.40లక్షలు, రాంపూర్‌లో రూ.25 లక్షలతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు మంజుల, మేఘమాల, వైస్ ఎంపీపీ మల్లారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, జిల్లా కోఆప్షన్ నెంబర్ మన్సూర్ అలీ, దక్ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ సావిత్రి రెడ్డి, పీడీఓ గణేష్ రెడ్డి, చాయతీరాజ్ డీఈ అమరేశ్వర్, ఏఈ ఇర్ఫాన్ హుస్సేన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్, ఎంపీఓ కృష్ణవేణి, సర్పంచ్‌లు కిష్టయ్య, మోతీ, లావణ్య, శ్రీనివాస్‌నాయక్, కిష్టయ్య, మాధవి, సుజాత, నాగరాణి, రూప్సీలక్ష్మి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచిగా సిద్దిపేట

భగీరథ, దళితబంధు, హరితహారానికి పునాది ఇక్కడే..

- ఐటీ టవర్ ఏర్పాటుతో యువతకు ఉపాధి
- బహిరంగ సభలో మంత్రి కేటీఆర్
- కేసీఆర్ అభివృద్ధిని కొనసాగిస్తున్నానన్న మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్



ఐటీ టవర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, ఫారూక్ హుస్సేన్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు

సిద్దిపేటఅర్బన్: రాష్ట్రంలో ఇంటింటికి తాగునీరు అందిస్తున్న మిషన్ భగీరథ పథకానికి సిద్దిపేటలోనే పునాది పడిందని, ఐటీ టవర్ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి దొరుకుతుందని ఐటీ, పురపాలక, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం మంత్రి హరీశ్‌రావుతో కలిసి ఐటీ టవర్ ప్రారంభించిన అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. సిద్దిపేటలో అభివృద్ధి ఒరవడి 1980 దశకంలో కేసీఆర్ నాయకత్వంలో మొదలైందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు తాగునీరు అందించేందుకు లోయర్ మానేర్ డ్యాం నుంచి ఇర్కోడ్ గుట్టపై ట్యాంకు కట్టి నీళ్లు తెచ్చారని, దీని స్ఫూర్తిగా భగీరథ పథకానికి శ్రీకారం చుట్టారని, దళిత చైతన్య జ్యోతి నుంచి దళిత బంధు పుట్టిందని కొనియాడారు. రూ.80 కోట్లతో వాటర్ రింగ్ మెయిన్ ఏర్పాటు చేసుకున్నామని, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేశామన్నారు. మందపల్లిలో 400 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు, ఆటోనగర్ ఏర్పాటుతో యువతకు ఉపాధి కలుగుతుందన్నారు. వర్గల్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, ఐటీ టవర్‌తో జిల్లా ఖ్యాతి పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు ఉపాధి కల్పించేందుకు ఐటీ టవర్‌లను విస్తరిస్తామని పేర్కొన్నారు. టాస్క్ సెంటర్‌తో నిరుద్యోగ యువతకు శిక్షణ అందిస్తారని తెలిపారు.

కేసీఆర్ బాటలో..

సిద్దిపేటలో ఐటీ టవర్ ప్రారంభం కలగా ఉందని, సిద్దిపేటలో అభివృద్ధికి కేసీఆర్ ఎప్పుడో పునాది వేశారని, దానిని నేను కొనసాగిస్తున్నానని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ ప్రణాళికలు, కలలను నిజం చేసే అదృష్టం దక్కిందని అన్నారు. ఐటీ టవర్‌ను ప్రారంభించిన అనంతరం 17 కంపెనీలు రిక్రూట్ చేసుకున్న ఉద్యోగులతో మంత్రులు ముచ్చటించారు. ఐటీ టవర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ తన పాటలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సతీశ్‌కుమార్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఫారూఖ్ హుస్సేన్, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, టీఎస్‌ఐఐసీ చైర్మన్ బాలమల్లు, ఎండీ నర్సింహారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, కలెక్టర్ ప్రశాంత్ జీవన్, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఓటరు తుది జాబితాకనుగుణంగా ఇంటింటి సర్వే చేపట్టి ఈనెల 22లోగా వందశాతం పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం ఇంటింటి ఓటరు జాబితా సర్వే, దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 17 నుంచి 22 వరకు జరిగే కార్యక్రమాల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేశ్‌లతో కలిసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అర్హత గల ప్రతి యువత ఓటరుగా నమోదు కావాలన్నదే ఎన్నికల సంఘం ఉద్దేశమని, అక్టోబర్1 నాటికి 18 సంవత్సరాలు నిండినవారు ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. అనంతరం మనఊరు– మనబడి కింద 30 లక్షలలోపు చేపట్టిన పనులు, వైకుంఠధామంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్, నీటి సరఫరా పనులు , తెలంగాణ క్రీడా ప్రాంగణాల పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గిరిజన దినోత్సవం, మంచినీళ్ల దినోత్సవం, హరితోత్సవం, విద్యాదినోత్సవం, ఆధ్యాత్మిక దినోత్సవం, అమరవీరుల సంస్మరణ దినోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మిషన్ భగీరథ ఈఈ కమలాకర్, డీఎస్‌డీఓ విజయలక్ష్మి, డీఎఫ్‌ఓ రవి ప్రసాద్, ఆర్డీఓలు సాయిరామ్, శ్రీనివాస్, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యాసంగి ధాన్యం కొనుగోళ్లు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసిందని కలెక్టర్ రాజర్షిషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 68,024 మంది రైతుల నుంచి 3.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించామన్నారు. 28,757 మంది రైతులకు చెందిన 1.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రూ.231.43 కోట్లు వారి ఖాతాలో జమ చేశామన్నారు. 86 శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తయ్యిందని, త్వరలో మిగతా డబ్బులు రైతుల ఖాతాలో జమచేస్తామన్నారు.

క్లుప్తంగా

పూరి గుడిసె దగ్ధం



కాలిపోయిన పూరి గుడిసె వద్ద బాధితులు

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్‌ మండలం వంగరామయ్యపల్లిలో వేముగంటి తిరుపతికి చెందిన పూరి గుడిసె బుధవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం బాధిత కుటుంబాన్ని సర్పంచ్‌ వంగ విజయలక్ష్మీవెంకట్రామిరెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని తహసీల్దారుకు విజ్ఞప్తి చేసినట్లు సర్పంచ్‌ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

కంది(సంగారెడ్డి): గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఇంద్రకరణ్‌ ఎస్‌ఐ రాజేష్‌నాయక్‌ కథనం ప్రకారం ఇంద్రకరణ్‌ నుంచి ఇస్నాపూర్‌ వెళ్లేదారిలో విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో ఓ మృతదేహం ఉందన్న సమాచారంతో పోలీసులు అక్కడకు వెళ్లారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 45 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉండవచ్చని, బ్లూకలర్‌ ప్యాంటు, తెల్లనిరంగు ఫుల్‌ షర్ట్‌ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712656719, 8712656747 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గర్భిణిపై దాడి

శివ్వంపేట(నర్సాపూర్‌): గర్భిణిపై దాడిచేసిన ఓ మహిళపై కేసు నమోదైంది. శివ్వంపేట పోలీసుల కథనం ప్రకారం..మండల పరిధి తాళ్లపల్లి తండాకు చెందిన సురేష్‌తో సుజాత వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కూతుళ్లు. భార్య సమ్మతితోనే సురేష్‌ రజితను రెండోపెళ్లి పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు భార్యల మధ్య గొడవ జరగడంతో సురేష్‌ రజితతో వేరు కాపురం పెట్టాడు. రజిత రెండున్నర నెలల గర్భవతి. గురువారం సుజాత, రజితల మధ్య గొడవ చోటుచేసుకుంది. రజితను సుజాత తిడుతూ పొట్టపై తన్నగా గర్భస్రావమైంది. పోలీసులు చికిత్స నిమిత్తం రజితను నర్సాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కార్మికుల రిలే దీక్షలు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం పారిశ్రామిక వాడలోని హార్టెక్స్‌ రబ్బరు పరిశ్రమ యాజమాన్యం కార్మికులపై సస్పెన్షన్‌ విధించటాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య హాజరై దీక్షను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హార్టెక్స్‌ రబ్బరు పరిశ్రమ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులపై విధించిన సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

నాయకమ్మ ఉత్సవాల్లో మంత్రి హరీశ్‌రావు



చిన్నకోడూరులో మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న పండితులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులోని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన నాయకమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో గురువారం రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి ఆలయ అర్చకులు, రెడ్డి సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాయకమ్మ దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. మంత్రి వెంట జెడ్పీ చైర్‌పర్సన్‌ రోజాశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి, సర్పంచ్‌ ఉమేష్‌ చంద్ర, వేద పండితులు సదాశివ శర్మ, సంగీత్‌ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

విత్తన దందా

బ్లాక్‌ మార్కెట్‌లో పత్తి నిల్వలు

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న దళారులు
- అధిక దిగుబడిపేర రెట్టింపు ధర
- జిల్లా అంతటా ఇదే పరిస్థితి



ప్రజ్ఞాపూర్‌లో పత్తి విత్తనాలు వేస్తున్న మహిళలు

గజ్వేల్‌: పత్తి విత్తన విక్రయాల్లో అక్రమార్కులు కొత్త తరహా దందాకు తెరలేపారు. శాస్త్రీయంగా అన్ని రకాల విత్తనాలు ఒకే రకమైన ఫలితాలు ఇస్తున్నా.. రైతులకు మాత్రం కొన్ని రకాలనే అంటగడుతున్నారు. అధిక దిగుబడి వస్తాయంటూ నమ్మబలుకుతూ ఎమ్మార్పీ కంటే రెట్టింపు ధరను వసూలు చేస్తున్నారు. అంతటితో ఆగకుండా సదరు రకం విత్తనాల స్టాకు లేదంటూ బుకాయిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 5.78లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు అంచనా ఉండగా, ఇందులో 1.30లక్షల ఎకరాల్లో పత్తి సాగవనున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

భారీగా ధర..

- జిల్లాలో ఏటా 5లక్షల బీటీ–2 విత్తనాలు అవసరముంటాయి. గతేడాది విత్తన ప్యాకెట్‌ రూ.810లు ఉండగా, ఈ ఏడాది రూ.853లకు పెరిగింది.
- గతేడాది మంచి దిగుబడులు ఇచ్చిన రెండు, మూడు రకాల విత్తనాలను ఎమ్మార్పీ కంటే రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు.
- రైతులు సహజంగా ఈ రకాలను అడుగుతుండగా, స్టాకు అందుబాటులో లేదని, రెట్టింపు ధర ఇస్తే తెప్పిస్తామంటూ రైతులను మోసగిస్తున్నారు.
- ప్రధానంగా యూ పేరుతో మొదలయ్యే ఓ ప్యాకెట్‌ అసలు దొరకటం లేదని చెప్పడంతో రైతులు దాని కోసం పరుగులు తీస్తున్నారు.
- జిల్లాలో పలు చోట్ల గత పది రోజులుగా ఈ విత్తన దందా జోరుగా సాగుతోంది.
- అధిక ధరలు వసూలు చేస్తున్న వ్యాపారులు బిల్లులో మాత్రం ఎమ్మార్పీ ధరను రాసి రైతులకు అందిస్తున్నారు. ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా జాగ్రత్తపడుతున్నట్లు సమాచారం.

నిషేధిత విత్తనాలు కూడా...

- నిబంధనలకు విరుద్ధంగా అక్రమార్కులు అనుమతిలేని బీటీ–3 విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు.
- ఈ విత్తనాలను వేస్తే బీటీ–2 కంటే తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడమే కాకుండా కలుపు ఉండదని నమ్మకం కలిగిస్తున్నారు.
- పంటల సాగులో కలుపు నివారణకు కూలీల ఖర్చు తగ్గుతుందంటూ అపోహ కల్పించి ప్రచారం చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు.
- ఈ ప్యాకెట్లకు బీటీ–2తో పోలిస్తే రెండు, మూడు రెట్లు వసూలు చేసి దండుకుంటున్నారు.
- వర్గల్‌ మండలంలో 2019 ఏప్రిల్‌లో విజిలెన్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు దాడులు నిర్వహించి మాదారం, అంబర్‌పేట, దండుపల్లికి చెందిన ముగ్గురిని అరెస్ట్‌ చేశారు.
- దీని తర్వాత కూడా జిల్లాలోని చాలా చోట్ల అనుమతి లేని బీటీ–3 పత్తి విత్తన దందా బయట పడింది.

చర్యలు తప్పవు



జిల్లాలో సమృద్ధిగా పత్తి విత్తన ప్యాకెట్ల నిల్వలున్నాయి. ఎవరైనా కొరత ఉందని చెబితే రైతులు నమ్మొద్దు. అధిక ధరలకు పత్తి విత్తన ప్యాకెట్లు విక్రయించినా, అనుమతిలేని బీటీ–3 విత్తనాలు అమ్మినా వారిపై క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తాం.

– శివప్రసాద్‌, జిల్లా వ్యవసాయాధికారి

చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

వేర్వేరు ఘటనల్లో గాయపడి ముగ్గురు చికిత్స పొందుతూ మృతి చెందారు.

రోడ్డుప్రమాదంలో గాయపడి...



హరిభూషణమ్మ (ఫైల్‌)

నర్సాపూర్‌, జిన్నారం : నర్సాపూర్‌– హైదరాబాద్‌ జాతీయ రహదారిపై గుమ్మడిదల పరిధిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సాపూర్‌కు చెందిన హరిభూషణమ్మ, ప్రకాష్‌, అన్నపూర్ణ, నాగరాణిలు గాయపడిన విషయం తెలిసిందే. వారికి నర్సాపూర్‌లో ప్రథమ చికిత్స అనంతరం నిమ్స్‌కు తరలించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ హరిభూషణమ్మ(75) గురువారం మరణించిందని కుటుంబసభ్యులు తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న సునీతారెడ్డి

రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించిన హరిభూషణమ్మ అంత్యక్రియలు సాయంత్రం నర్సాపూర్‌లో జరగగా రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ సునీతారెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

నేత్రాలు దానం

ఎల్‌వీ ప్రసాద్‌ ఐ ఇనిస్టిట్యూట్‌కు చెందిన డాక్టర్లు హరిభూషణమ్మ నేత్రాలు సేకరించారు. ఆమె అంగీకారం మేరకు నేత్రాలు తీసుకెళ్లామని డాక్టర్లు ఈ సందర్భంగా చెప్పారు.

బైక్‌పై నుంచి కింద పడి...



అనసూయ(ఫైల్‌)

వర్గల్‌(గజ్వేల్‌): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిది. మైలారం గ్రామానికి చెందిన అల్వాల్‌ ఆంజనేయులు– అనసూయ(48) దంపతులు ఒడిబియ్యం పోసుకునేందుకు ములుగు మండలం కొట్యాలకు వెళ్లారు. ఆదివారం రాత్రి వారు బైక్‌పై తిరిగొస్తుండగా నర్సంపల్లి శివారులో అదుపుతప్పి పడిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అనసూయను లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

పెళ్లి పత్రికలు పంచడానికి వెళ్లి..



రక్షిత్‌ (ఫైల్‌)

మద్దూరు(హుస్నాబాద్‌): మండల పరిధిలోని సలాఖపూర్‌ గ్రామానికి చెందిన వగలబోయిన రక్షిత్‌(18) తన సోదరి వివాహ పత్రికలను పంచడానికి స్నేహితునితో కలిసి బైక్‌పై బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా చేర్యాలలో ఈ నెల 8వ తేదీన డివైడర్‌ను ఢీ కొన్నారు. ఈ ఘటనలో స్నేహితునితో పాటు రక్షిత్‌ ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలైన రక్షిత్‌ను నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ భాస్కర్‌ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అకస్మాత్తుగా చిన్నారి మృతి



సుస్మిత(ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: అకస్మాత్తుగా ఓ చిన్నారి మృతి చెందింది. పటాన్‌చెరు ఏఎస్‌ఐ సురేందర్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌ నకు చెందిన అంజమ్మకు ఎనిమిదేళ్ల క్రితం దుర్గేష్‌తో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. మూడేళ్ల కిందట అంజమ్మ పటాన్‌చెరు మండలం చిట్కుల్‌ గ్రామం వడ్డెర కాలనీకి వచ్చింది. అమ్మగారి ఇంటి పక్కనే పిల్లలతో కలిసి ఉంటూ కూలి పనులకు వెళుతోంది. సోదరుడి భార్య ప్రసవం కావడంతో ఈనెల 14వ తేదీన పిల్లలను పక్కనే ఉంటున్న తల్లి మల్లమ్మ వద్ద వదిలిపెట్టి నిలోఫర్‌ ఆస్పత్రికి వెళ్లింది. అంజమ్మ రెండో కూతురు సుస్మిత(5) బుధవారం రాత్రి భోజనం తిన్న తర్వాత వాంతులు చేసుకొని పడుకుంది. గురువారం తెల్లవారుజామున నీరు తాగిద్దామని సుష్మితను అమ్మమ్మ లేపగా లేవలేదు. దీనితో అంజమ్మ సోదరుడు ఎల్లేష్‌, మరో సోదరుడు రమేష్‌లు చిన్నారిని స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించారు. వారి సూచన మేరకు పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు లెక్కిస్తుండగా చోరీ

సంగారెడ్డి టౌన్‌ : బ్యాంకులో ఓ మహిళ నగదు లెక్కిస్తుండగా చోరీ జరిగింది. రూరల్‌ పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి మండలం కొత్లాపూర్‌ గ్రామానికి చెందిన సామేల్‌ అతడి భార్య చమంతలు గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌ ఎదుట ఉన్న ఎస్‌బీఐకి బంగారం లోన్‌ చెల్లించేందుకు రూ.2లక్షలు తీసుకొచ్చారు. చమంత కౌంటర్‌ వద్ద డబ్బులు లెక్కిస్తుండగా ఓ గుర్తు తెలియనివ్యక్తి 48 వేల నగదు తీసుకున్నాడు. గమనించి బ్యాంక్‌ క్యాషియర్‌ చెప్పాడు. అప్పటికే ఆ గుర్తు తెలియని వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. బ్యాంకులో లెక్కిస్తుండగా తమ నగదును గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లినట్టు సామెల్‌ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.

కుటుంబ కలహాలతో..

గజ్వేల్‌రూరల్‌: గజ్వేల్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వనపర్తి జిల్లా, గద్వాల్‌పల్లి గ్రామానికి చెందిన కొత్త్వాల్ల రాజు(37) ఎనిమిదేళ్ల క్రితం ఉపాధి కోసం గజ్వేల్‌కు వచ్చాడు. రాజు తాపీమేస్త్రీగా పనిచేస్తుండగా భార్య లక్ష్మీ కూలి పనులకు వెళుతోంది. ఈ క్రమంలో తరచు వీరి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 12న గొడవ జరగడంతో లక్ష్మీ మహబూబ్‌నగర్‌లోని తన సోదరి ఇంటికి వెళ్లింది. బుధవారం మరోసారి ఇద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన రాజు ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం రాజు కుటుంబ సభ్యులు ఫోన్‌ చేయగా స్పందించకపోవడంతో ఇంటికి వచ్చి చూసే సరికి మృతి చెందినట్టు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో...

పటాన్‌చెరు టౌన్‌: అమీన్‌పూర్‌ పోలీసుల కథనం ప్రకారం.. గుల్బర్గాకు చెందిన వడ్డె గౌరమ్మ –సుభాష్‌ దంపతులు మూడు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్‌ మండలం సుల్తాన్‌పూర్‌ గండిగూడెం వద్ద ఉంటున్నారు. సుభాష్‌ మేస్త్రి పనిచేస్తుండగా, మొహంపై ఎలర్జీ కావడంతో బంధువుల శుభకార్యాలకు వెళ్లేవాడు కాదు. అయితే మూడు రోజుల క్రితం గుల్బర్గాకు భార్య గౌరమ్మ వెళ్లగా సుభాష్‌ ఇంటి వద్ద ఉన్నాడు. ఈ క్రమంలో తిరిగి గౌరమ్మ 14వ తేదీ మధ్యాహ్నం ఇంటికి రావడంతో అప్పటికే మద్యం సేవించి సుభాష్‌ పడుకొని ఉన్నాడు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు బయటకు వెళ్లిన సుభాష్‌ తిరిగి రాలేదు. రాత్రి గండిగూడ శివారులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపానికి గురై..



మహిపాల్‌ మృతదేహం

మెదక్‌ మున్సిపాలిటీ: కుటుంబసభ్యులు, స్థానికుల కథనం ప్రకారం..పట్టణంలోని నర్సిఖేడ్‌ వీధికి చెందిన కాశం మహిపాల్‌(45) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య సుజాత ప్రభుత్వఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. తరచు దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి కూడా ఇద్దరు గొడవ పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన మహిపాల్‌ పెంట్‌హౌస్‌లోకి వెళ్లి కేబుల్‌ వైరుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్నాథం తెలిపారు.

ఐదుగురి అదృశ్యం...

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల ఐదుగురు అదృశ్యమయ్యారు.

ఇంట్లో ఎవరికి చెప్పకుండా



సుజాత(ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: తల్లి అదృశ్యంపై ఓ కుమారుడు ఫిర్యాదు చేశాడు. అమీన్‌పూర్‌ పోలీసుల కథనం ప్రకారం...హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన ప్రవీణ్‌కుమార్‌ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇతడి తల్లి సుజాత(65) 14వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. తెలిసిన వారి వద్ద బంధువుల వద్ద, వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తన తల్లి అదృశ్యమైనట్లు కుమారుడు ప్రవీణ్‌ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూతురు కనిపించడం లేదని...



సనా ఫాతిమా (ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: కూతురి అదృశ్యంపై ఓ తండ్రి ఫిర్యాదు చేశాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరుకు చెందిన ఎండీ ఫయాజ్‌ కార్పెంటర్‌ పనిచేస్తున్నాడు. ఈయన కూతురు సనా ఫాతిమా ఇంటర్‌ వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 14వ తేదీన ఇంట్లో ఎవరు లేని సమయంలో సనాఫాతిమా ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిన తిరిగి రాలేదు. దీంతో కూతురు కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యమైన ఘటనలో ఓ వ్యక్తిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో....



మద్దెల నర్సవ్వ

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం..మిరుదొడ్డికి చెందిన వృద్ధురాలు మద్దెల నర్సవ్వ ఇంట్లో తరచు కుటుంబ కలహాలు జరుగుతుండేవి. దీంతో రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన నర్సవ్వ తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఫలితం లేక పోయింది. నర్సవ్వ కూతురు బిట్ల భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దంపతుల మధ్య గొడవ జరిగి..

శివ్వంపేట(నర్సాపూర్‌): కొడిపల్లి మండలం వెల్మకన్న గ్రామానికి చెందిన ఉరడి రమేష్‌ భార్య మానసతో కలిసి మూడు రోజుల క్రితం శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కలో ఉంటున్న వారి బంధువుల వద్దకు వచ్చారు. అక్కడ దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో రమేష్‌ బుధవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. వెతికినా ఆచూకీ లభించలేదు. రమేష్‌ భార్య మానస గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భార్యను తీసుకురావడానికి వెళ్లి...



వెంకన్న (ఫైల్‌)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో నివాసం ఉండే వెంకన్న కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతనెల 20వతేదీన అతని భార్య జ్యోతి పుట్టింటికి వెళ్లింది. పదిరోజుల తర్వాత వెంకన్న భార్యను తీసుకొచ్చేందుకు అత్తగారింటికని సూర్యాపేటకు బయలుదేరాడు. పదిహేను రోజులైనా కొడుకు రాలేదని వెంకన్న తండ్రి గురవయ్య కోడలుకు ఫోన్‌ చేశాడు. తన భర్త అసలు ఇక్కడకు రాలేదని మామతో చెప్పింది. దీంతో గురవయ్య తన కొడుకు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సూచిక బోర్డు ఏర్పాటు



గ్రామకంఠం స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం పంచాయతీ పరిధి అల్లీనగర్‌ గ్రామ కంఠం స్థలాన్ని కబ్జా చేసిన పరిశ్రమ యాజమాన్యం రోడ్డు వేసేందుకు యత్నించటంతో ఆందోళనలు జరిగిన విషయం తెలిసిందే. శుక్రవారం గ్రామ పంచాయతీ ఈఓ నరేశ్‌ ఆధ్వర్యంలో గ్రామ కంఠం సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ స్థలాన్ని గ్రామ అవసరాలకు ఉపయోగించుకుంటామని ఈఓ తెలిపారు.

ప్రభుత్వ చర్యలు భేష్‌

వరల్డ్‌ ఫుడ్‌ అండ్‌ అగ్రికల్చర్‌ ఆర్గనైజేషన్‌ డైరెక్టర్‌ జనరల్‌ క్యూ డెంగ్‌యూ



కొండపోచమ్మసాగర్‌ పంప్‌హౌస్‌ వివరాలు తెలుసుకుంటున్న డబ్ల్యూఎఫ్‌ఏఓ డైరెక్టర్‌ జనరల్‌ క్యూ డెంగ్‌యూ

గజ్వేల్‌: పదేళ్ల క్రితం సాగునీరు లేక తల్లడిల్లిన రోజుల నుంచి నేడు రిజర్వాయర్ల ఏర్పాటుతో రెండు పంటలు పండించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తెలుస్తున్నాయని వరల్డ్‌ ఫుడ్‌ అండ్‌ అగ్రికల్చర్‌ ఆర్గనైజేషన్‌(డబ్ల్యూఎఫ్‌ఏఓ) డైరెక్టర్‌ జనరల్‌ క్యూ డెంగ్‌యూ అన్నారు. జీ–20 దేశాల సదస్సులో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన డెంగ్‌యూ గురువారం సిద్దిపేట జిల్లా మర్కూక్‌లో పర్యటించారు. ఎఫ్‌ఏఓ ప్రతినిధులతో కలిసి కొండపోచమ్మసాగర్‌, రైతువేదికలను సందర్శించగా, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, అదనపు కలెక్టర్‌ ముజామ్మిల్‌ఖాన్‌, ఎఫ్‌డీసీ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి వీరికి స్వాగతం పలికారు. అనంతరం ప్రాజెక్టు వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. మర్కూక్‌ రైతువేదికను సందర్శించి కొద్దిసేపు రైతులతో ముచ్చటించారు. గతానికి, ప్రస్తుతానికి వచ్చిన మార్పులు, ఆదాయం పెరుగుదలపై అడిగి తెలుసుకున్నారు. ఆయన ప్రసంగాన్ని తెలుగులోకి అనువదించి, రైతులు మాట్లాడగా, ఆ విషయాలను డెంగ్‌యూకు ఇంగ్లిష్‌లోకి అధికారులు అనువదించారు. ఈ సందర్భంగా డెంగ్‌యూ మాట్లాడుతూ తాను కూడా రైతుబిడ్డనేనని, చైనాలో తమ కుటుంబానికి రెండున్నర ఎకరాల పొలం ఉందన్నారు. 50 ఏళ్ల కిందటే తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం నేర్చుకున్నానన్నారు. చైనాలో రాక్‌ రిజర్వాయర్‌ల నిర్మాణంతో సాగునీటి సమస్య తీరిందన్నారు. రైతుబిడ్డగా ఉన్న తానూ నేడు ఎఫ్‌ఏఓ డైరెక్టర్‌ జనరల్‌గా రాణిస్తున్నానని, కష్టపడితే ఎవరైనా ఈ స్థాయికి చేరుకోవచ్చన్నారు. వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందించారు. మహిళలు వ్యవసాయరంగంలో రాణిస్తున్నారని తెలిసి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శి హన్మంతు, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌, జిల్లా ఉద్యాన అధికారి ములుగు ఏడీఏ అనిల్‌, మర్కూక్‌ ఎంపీపీ పాండుగౌడ్‌, జెడ్పీటీసీ మంగమ్మ, రైతులు పాల్గొన్నారు. పర్యటనలో ఎఫ్‌ఏఓ ప్రతినిధులు నమస్కారం అంటూ స్థానికులను పలకరించారు.

రోడ్డు టెర్రర్‌

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరుచోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు గాయపడ్డారు.

జాతీయ రహదారిపై కార్లు ఢీ



కాళ్లకల్‌ వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన కార్లు

మనోహరాబాద్‌(తూప్రాన్‌): మండలపరిధిలోని కాళ్లకల్‌ శివారులో మేడ్చల్‌ వైపు వెళుతున్న కారును వెనుక వస్తున్న మరో కారు ఢీ కొట్టింది. వీటి వెనకాలె మరో కారు, ప్రయాణికులతో ఉన్న ఆటో ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారు రోడ్డు పక్కన గుంతలో పడిపోయింది. కాగా వాహనాల్లో ఉన్న ప్రయాణికులకు చిన్నచిన్న గాయాలు అయ్యాయి. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో ఒక్కసారిగా ట్రాఫిక్‌జామ్‌ అయ్యింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ క్లియర్‌ చేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు...

పటాన్‌చెరు టౌన్‌: ద్విచక్ర వాహనాన్ని ఓ కారు ఢీకొట్టింది. అమీన్‌పూర్‌ పోలీసుల కథనం ప్రకారం దుండిగల్‌ మండలం శంబీపూర్‌ గ్రామానికి చెందిన క్యాసారం సత్తయ్య అమీన్‌పూర్‌ పరిధిలోని ప్రణీత్‌నైట్‌ఉడ్స్‌లో జేసీబీ నడుపుతున్నాడు.ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీన శంబీపూర్‌ నుంచి బైక్‌పై వస్తుండగా ప్రణవ్‌ హోమ్స్‌ సమీపంలోకి రాగానే కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో క్యాసారం సత్తయ్యకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. సత్తయ్య కుమారుడు క్యాసారం భాస్కర్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముందుకారును ఢీకొట్టి



పల్టీకొట్టిన కారు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ముందు వెళుతున్న ఓ కారు ఢీకొట్టి మరో కారు పల్టీ కొట్టింది. పోలీసులు కథనం ప్రకారం.. చింతల్‌ ప్రాంతానికి చెందిన సాయికుమార్‌ గురువారం ఇన్నోవా కారులో శంషాబాద్‌ నుంచి మేడ్చల్‌కు ఓఆర్‌ఆర్‌ పైనుంచి వెళుతున్నాడు. కొల్లూర్‌ వద్దకు రాగానే సాయికుమార్‌ కారును వెనుక నుంచి మహారాష్ట్రకు చెందిన ఎస్‌క్రాస్‌ కారు ఢీకొట్టి పల్టీకొట్టింది. దీంతో ఎస్‌క్రాస్‌ కారులో ఉన్న అజిత్‌, రాజశ్రీలు గాయాలపాలయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పిన లారీ



వడియారం శివారులో అదుపుతప్పి పడిపోయిన లారీ

చేగుంట(తూప్రాన్‌): అదుపు తప్పి ఓ లారీ పల్టీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ..హైదరాబాద్‌ నుంచి నిజామాబాద్‌ వైపునకు స్టేషనరీ తీసుకెళుతున్న లారీ వడియారం శివారు బైపాస్‌ చౌరస్తా 44వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి అదుపు తప్పింది. అరగంట పాటు ట్రాఫిక్‌ సమస్య ఏర్పడగా, వాహనదారులు స్పందించి ట్రాక్టర్ల సాయంతో లారీని పక్కకు జరిపారు.